


వినియోగంలోకి వచ్చిన హైమాస్ట్ లైట్లు

చెన్నూరు, జూలై 11: అలంకారప్రాయంగా హైమాస్ట్ లైట్లు అనే శీర్షికన ఈ నెల 4న ప్రచురితమైన ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన ఎట్టకేలకు అధికారులు స్పందించారు. హైమాస్ట్‌లైట్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి వినియోగంలోకి తెచ్చారు. జాతీయ రహదారి 63 విస్తరణ పనుల్లో భాగంగా ఆస్నాద్ చౌరస్తా వద్ద హైమాస్ట్‌లైట్లను ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ మరిచారు. ఆంధ్రజ్యోతి కథనంపై స్థానికులు ఎమ్మెల్యే వివేక్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఎమ్మెల్యే జాతీయ రహదారుల అధికారులతో మాట్లాడడంతో గురువారం అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు.

అదను దాటుతోంది..



బీడుగా ఉన్న నెన్నెల కుమ్మరివాగు ప్రాజెక్టు ఆయకట్టు

- జిల్లాలో సగటున 20 శాతం లోటు వర్షపాతం
- వెలవెలబోతున్న జలాశయాలు
- వెనుకబడ్డ సాగు పనులు
- ప్రారంభం కాని వరినాట్లు
- వరి సాగుపై రైతుల్లో సందిగ్ధం
- వడలి పోతున్న పత్తి మొక్కలు
- ఆందోళనలో అన్నదాతలు

చినుకు జాడ కానరావడం లేదు... చెరువులు, కుంటలు నీరు లేక వెలవెలబోతున్నాయి... మబ్బులు కమ్ముకున్నా ఊరించి ఉసూరుమంటున్నాయి... అడపాదడప చినుకులు పడినా నేలకూడా తడవడం లేదు. వానాకాలం ప్రారంభమై నెలన్నర రోజులు దాటినా సాగు పనులు ముందుకు సాగడం లేదు... దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

నెన్నెల, జూలై 11: జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. చెరువులు, ప్రాజెక్టుల్లో నీరు చేరక పోవడంతో ఆయకట్టు సాగు జాప్యమవుతోంది. గురువారం వరకు జిల్లా సాధారణ వర్షపాతం 265.7 శాతం కాగా 213.3 శాతం వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇప్పటికి 20 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఏడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా పది మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. దీంతో వానాకాలం పంట సీజన్ నెలన్నర వెనుకబడింది. ఫలితంగా వరి సాగుపై రైతుల్లో సందిగ్ధత నెలకొంది. ఇప్పటికి జోరుగా వరినాట్లు సాగాల్సి ఉండగా.. కొందరు నారు మడులు సిద్ధం చేసుకొని నాట్లు వేసేందుకు ఎదురు చూస్తున్నారు. మరి కొందరు దుక్కులు దున్నుకొని విత్తనాలు వేసుకునేం దుకు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు.

జిల్లాలో 1.60 లక్షల ఎకరాల్లో వరి సాగు లక్ష్యం కాగా 69256 ఎకరాల్లో సరిపడ వరి నారుమడులు వేసుకున్నారు. జిల్లాలో 101 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు వేశారు. వాతావరణ పరిస్థితులు పత్తి సాగు చేస్తున్న రైతులను సైతం కలవర పెడుతోంది. పత్తి పంట లక్ష్యం 1.90 లక్షల ఎకరాలు కాగా 1,33,890 ఎకరాల్లో సాగైంది. భూమిలో పదును లేక పత్తి మొక్కల పెరుగుదల నిలిచిపోయింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు.

10 మండలాల్లో లోటు...

జిల్లాలోని జన్నారం, దండెపల్లి, హాజీపూర్, తాండూరు, భీమిని, కన్నెపల్లి, నెన్నెల, మందమర్రి, మంచిర్యాల, భీమారం మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. లక్షెట్టిపేట, వేమనపల్లి, బెల్లంపల్లి, నస్పూరు, జైపూర్, చెన్నూరు, కోటపల్లి మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్టు వాతావరణశాఖ గణాంకాలు చెబుతున్నాయి. కాసిపేట మండలంలో మాత్రమే 22 శాతం అధిక వర్షపాతం కురిసింది.

జలాశయాలు వెలవెల

చెరువులు, ప్రాజెక్టుల్లో ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. భూగర్భజలాలు సైతం అడుగంటి పోతున్నాయి. భారీ వర్షాలు కురిసి వరదలు పారితే తప్ప కుంటలు, చెరువులు, ప్రాజెక్టులకు నీరు చేరదు. సీజన్‌లో ఒక్క భారీ వర్షం కూడా కురవక పోవడంతో జలాశయాలు వెలవెల బోతున్నాయి. నిరుడు ఈ సమయానికి చెరువులు నిండి మత్తడి దూకాయి. ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది.

వరి సాగు ప్రశ్నార్థకం

జిల్లాలో లోటు వర్షపాతంతో వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. బోరుబావులు ఉండి నీటి సౌకర్యం ఉన్నవారు మాత్రమే నాట్లకు సిద్ధపడుతుండగా, ఆయకట్టు రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. జలాశయాల్లో సమృద్ధిగా నీరుంటే కాల్వల ద్వారా నీరు అందడమే కాకుండా భూగర్భ జలమట్టం పెరిగి సాగు నీరందేది. ప్రస్తుతం భిన్నమైన పరిస్థి తులు నెలకొనడంతో వరి సాగుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

జిల్లాలో వర్షాపాతం (మిల్లీమీటర్లలో)

మండలం	కురువాల్సింది	కురిసింది	లోటుశాతం
జన్నారం	304.0	219.9	28
దండెపల్లి	248.7	172.3	31
లక్షెట్టిపేట	262.6	213.5	19
హాజీపూర్	268.3	206.6	23
కాసిపేట	264.5	321.7	22 (అధికం)
తాండూర్	239.9	183.7	23
భీమిని	276.3	124.9	55
కన్నెపల్లి	280.6	199.0	29
వేమనపల్లి	278.3	249.7	10
నెన్నెల	258.2	172.3	33
బెల్లంపల్లి	258.8	264.7	2
మందమర్రి	251.1	178.9	29
మంచిర్యాల	262.6	200.9	23
నస్పూర్	261.7	252.8	3
జైపూర్	279.3	221.1	21
భీమారం	270.6	206.3	24
చెన్నూరు	264.3	256,3	3
కోటపల్లి	252.5	201	20

జిల్లాలో ఇప్పటికి సాగైన పంటలు

పంట	సాగు విస్తీర్ణం
వరి 101 ఎకరాల్లో	(69,256 నారుమడులు)
మక్క	17 ఎకరాల్లో
కంది	182 ఎకరాల్లో
పెసర	17 ఎకరాల్లో
పత్తి	1,33,890 ఎకరాల్లో

ఎదుగుదల లేని పత్తి

మృగశిర కార్తె తర్వాత సాధారణంగా వర్షాలు జోరందుకుంటాయి. అదే నమ్మకంతో చాలా మంది రైతులు పొడి దుక్కుల్లోనే పత్తి విత్త నాలు వేసుకున్నారు. మొదట మోస్తారు వర్షం కురిసి 15 రోజుల వరకు మరో వర్షం రాక పోవడంతో ఆ విత్తనాలు మట్టిలోనే వట్టిపోయా యి. చేలల్లో మొలకలు పలుచగా మొలవడంతో మరో సారి విత్తనాలు వేసుకోవాల్సి వచ్చింది. సరైన వర్షాలు లేక పత్తి మొక్కలు ఎదగడం లేదు. భూమిలో తడిలేక మొకాలి ఎత్తు పెర గాల్సిన మొక్క జానెడు కూడ పెరగక డీలాపడిపోతోందని రైతులు వాపోతున్నారు.

పింఛన్ల పెంపునకు మార్గం సుగమం

- మంత్రి ఆదేశాలతో కదులుతున్న యంత్రాంగం
- అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్న అధికారులు
- వచ్చే నెల 1 నుంచి ఇచ్చేందుకు సన్నాహాలు



మంచిర్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇటీవల గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖలపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త పింఛన్ల జారీకి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను మంత్రి ఆదేశించారు. అంతా సవ్యంగా సాగితే ఆగస్టు 1 నుంచే కొత్త పింఛన్లు అందజేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగానే పింఛన్‌దారుల నివేదికను అధికారులు ప్రభుత్వానికి అందజేయనున్నారు. ఆయా దరఖాస్తులతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెండింగులో ఉన్న పింఛన్ జాబితా పరిగణలోనికి తీసుకోవడం ద్వారా అర్హుల జాబితా తయారు చేయాలనే ఆదేశాలు వెలువడ్డాయి. చేయూత పథకం కింద చేనేత, ఫైలేరియా రోగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఎయిడ్స్ రోగులు, గీత కార్మికులు, బీడీ కార్మికులకు పింఛన్లు అందజేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆసరా పథకం కింద రూ.2016, దివ్యాంగులకు రూ.3016 ఇవ్వగా, కాంగ్రెస్ హయాంలో చేయూత పథకం ద్వారా దివ్యాంగులకు రూ.6లు, ఇతరులకు రూ. 4 వేలు అందించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది.



పూర్తయిన దరఖాస్తుల పరిశీలన

చేయూత పథకం అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండటంతో ఆయా విభాగాలకు చెందిన దరఖాస్తుల పరిశీలన దాదాపుగా పూర్తికావచ్చింది. జాబితాను కంప్యూటరైజ్ చేసిన అనంతరం సంబంధిత అధికారులు అర్హుల తుది జాబితాను ప్రభుత్వానికి అందజేయనున్నారు. దాని ఆధారంగా కొత్త పింఛన్లు లబ్ధిదారులకు అందనున్నాయి.

జిల్లాలో 10 లక్షలకు పైగా దరఖాస్తులు

ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా వివిధ పథకాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా మొత్తం 10లక్షల 84వేల 479 దరఖాస్తులను అధికారులు ఆమోదించారు. వీటిలో ఇప్పటి వరకు 2 లక్షల 54వేల 989 దరఖాస్తులు కంప్యూటరైజ్ చేయగా, మిగతా వాటిని త్వరలో ఎంటర్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తుల్లో చేయూత పథకంలో భాగంగా కొత్త పింఛన్లు మంజూరు చేసేందుకు అంగవైకల్యం కింద మొత్తం 6591 దరఖాస్తులను అధికారులు ఆమోదించారు. ఇతర విభాగాలకు చెందిన పింఛన్ల కోసం 50వేల 467 దరఖాస్తులు అర్హత సాధించాయి.

చేయూత పథకంలో భాగంగా అంగవైకల్యం కింద జిల్లా లోని అర్హులకు పింఛన్లు అంద జేసేందుకు నెలకు రూ.3 కోట్ల 95 లక్షల 46 వేలు అవసరం కాగా ఇతర విభాగాల వారికి పింఛన్లు మంజూరు చేసేందుకు నెలకు రూ.20 కోట్ల 18 లక్షల 68 వేలు అవసరం అవుతాయి. ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఆగస్టు 1 నుంచి లబ్ధిదారులకు అందజేసే అవకాశాలు ఉన్నాయి. ఇతర పథకాలకు సంబంధించి 10 లక్షల 27వేల 421 మందికి లబ్ధి చేకూర్చాల్సి ఉంది. ఇందులో గృహిణులకు రూ.2500 పథకం కింద 210614 దరఖాస్తులు ఫైనల్ కాగా, వంటగ్యాస్ కింద 213023, రైతులకు రూ.15000 పథకం కింద 93632, కౌలు రైతులకు రూ. 15000 పథకం కింద 10596, రూ.12000 పథకం కింద 106365, 323 చదరపు గజాల ఇంటి స్థలం పథకం కింద 323, ఉద్యమ కారులకు ఇంటి స్థలం పథకం కింద 2534, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం కింద 2534 దరఖాస్తులు అర్హత పొందాయి.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

హాజీపూర్, జూలై 11: రైతుల పంటలకు కనీస మద్దతు ధర పెంచినందుకు గురువారం బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్‌రెడ్డి మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ రైతుల పంటలకు కనీసమద్దతు ధర పెంచడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ, రైతుబంధు పెండింగ్‌లో పెట్టి మోసం చేస్తుందన్నారు. నాయకులు వెంకటరమణరావు, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జనాభా దినోత్సవంపై అవగాహన ర్యాలీ



పీహెచ్‌సీ వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి

నస్పూర్, జూలై 11: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ వద్ద గురువారం ర్యాలీని డీఎంహెచ్‌వో అనిత జెండా ఊపి ప్రారంభించారు. ఆరోగ్య కేంద్రంలో అంగన్ వాడీ, ఆరోగ్య కార్య కర్తలకు, ఆశ వర్కర్లకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్లు నీరజా, అరుణశ్రీ, సమత, విజయపూర్ణిమ, నస్పూర్ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ సమత, ఎస్‌ఓ వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఓ దామోదర్, డీపీవో ప్రశాంతి, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట దర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నస్పూర్, జూలై 11: విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట దర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టరేట్‌లోకి వెళ్లాలని ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు అందించారు. నాయకులు మాట్లాడుతూ ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు అభినవ్, తిరుపతి, అరవింద్, పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల నిరసన

విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం (టీఎస్‌జీఆర్ఇఎ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయంలో అధికారికి అందించారు. విశ్రాంత ఉద్యోగులు సంఘ నాయకులు మాట్లాడుతూ నగదు రహిత వైద్య సేవలు అందించే ఎంప్లాయిస్ హెల్త్ స్కీం (ఈహెచ్ఎస్) సక్రమంగా పని చేయడం లేదన్నారు. వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. పెన్షనర్లకు రావాల్సిన డీఆర్ నాలుగు వాయిదాలు విడుదల చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు క్రిష్ణ, ప్రధాన కార్యదర్శి జగన్ నాయకులు పాల్గొన్నారు.

రైతు భరోసా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

ఏసీసీ, జూలై 11 : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రైతు భరోసా యాత్రలో భాగంగా ఉట్నూరులో రైతుల సమస్యలు, వివిధ అంశాలపై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని గురువారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఆధ్వర్యంలో రైతులు, కాంగ్రెస్ శ్రేణులు మంచిర్యాల నుంచి తరలివెళ్లారు. ఆదిలాబాద్ ఎంపీ గెడెం నగేష్, ఎమ్మెల్యేలు గడ్డం వివేకానంద, వెడ్మ బొజ్జు, లక్ష్మీ, రామరావు పటేల్, అనిల్ జాదవ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి నిధులు మంజూరు

భీమారం, జూలై 11 : బూరుగుపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం అభివృద్ధికి రూ.2 లక్షల నిధులు మంజూరయ్యాయని ఎంపీడీవో రాథోడ్ రాధ తెలిపారు. గురువారం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో సందర్శించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో పలు అభివృద్ధి పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో న్యూట్రిషన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని అంగన్‌వాడీ టీచర్ పద్మకు సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నాటిన ప్రతీ మొక్కను కాపాడాలని సూచించారు. ఏపీఓ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యంపై విద్యార్థులకు అవగాహన

మందమర్రిరూరల్, జూలై 11: ఆదర్శ పాఠశాల విద్యార్థులకు జీవన నైపుణ్యం అనే అంశంపై మంచిర్యాలకు చెందిన రిటైర్డు బొటనీ ప్రొఫెసర్ శేఖర్ అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలన్నారు. సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు

మందమర్రిరూరల్, జూలై 11 : ఉట్నూరులో జరిగిన రైతు భరోసా కార్యక్రమానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణను కలిశారు. వంశీకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు, రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు.

ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా సాయికుమార్

బెల్లంపల్లి, జూలై 11 : బెల్లంపల్లి నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ ఉపాధ్యక్షుడిగా చిలుముల సాయికుమార్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్ వర్ధన్ తెలిపారు. గురువారం సాయికుమార్‌కు నియామక పత్రం అందించారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులచే చదివిస్తున్న డీఈవో యాదయ్య

కోటపల్లి, జూలై 11: మండలంలోని ఎర్రాయిపేట, కొల్లూరు, రావులపల్లి, దేవులవాడ, వెల్మపల్లి, లక్ష్మీపూర్, రాపనపల్లి గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యను పరిశీలించిన ఆయన తరగతి గదిలో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. మరో వైపు పాఠ్యాంశాలు బోధించారు. తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణను తనిఖీ చేసిన ఆయన ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. ఉపాధ్యాయుల కృషితోనే మారుమూల గ్రామాల్లోనే విద్యాభివృద్ధి కొనసాగుతుందని, ఉపాధ్యాయులు సామాజిక సేవకులుగా పనిచేయాలన్నారు. దేవులవాడ ఉన్నత పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యపై చర్చించారు. సెక్టోరియల్ అధికారి చౌదరితో పాటు అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ పట్టా రద్దు చేయాలని ఆర్డీవోకు వినతి

బెల్లంపల్లి, జూలై 11 : తమ భూమిని కొందరు అక్రమ పట్టా చేసుకున్నారని, పట్టాను రద్దు చేసి న్యాయం చేయాలని గురువారం ఆర్డీవోకు బాద్రపు రాజనర్సు, రాజమల్లు, కమల, రాజేందర్‌లు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ మండలంలోని కన్నాల శివారు సర్వే నెంబరు 109/20లో 5 ఎకరాల వ్యవసాయ భూమి 1972లో కొనుగోలు చేశామన్నారు. ఈ భూమిని కొందరు వ్యక్తులు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై అక్రమంగా పట్టా చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు.

జర్నలిస్టులపై దాడిని ఖండిస్తూ నిరసన

చెన్నూరు, జూలై 11: హైద్రాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీలో జర్నలిస్టులపై పోలీసులు దాడి చేయడాన్ని ఖండిస్తూ గురువారం చెన్నూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అట్టెం మధునయ్య మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు




మ్యాదరిపేటలో పోచమ్మతల్లి బోనాల ఊరేగింపు, నస్పూర్‌లో బోనాల ఊరేగింపు

దండేపల్లి, జూలై 11: మండల కేంద్రంతో పాటు చింతపల్లి, మ్యాదరిపేటలో గురువారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆటో యునియన్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఆటోవాహన యజమానులు, డ్రైవర్లు రోడ్డు మైసమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం మేకలు, కోళ్ల బలి ఇచ్చారు. చింతపల్లిలో పంబాలి పూజారులచే గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. పాడిపంటలు, కుటుంబ సభ్యులను కాపాడాలని మొక్కులు చెల్లించుకున్నారు. పోచమ్మతల్లి, పెద్దమ్మ, పెద్దిరాజు, చిన్నయ్య, పెద్దయ్య స్వాములకు పూజలు చేశారు. మ్యాదరిపేటలో పోచమ్మతల్లికి బోనాల జాతరను నిర్వహించారు. మహిళలు ప్రత్యేక నైవేద్యంతో బోనం ఎత్తుకుని ఊరేగింపుగా పోచ మ్మతల్లి ఆలయానికి చేరుకొని పూజలు చేశారు.

వారసంత వ్యాపారుల ఆషాఢ బోనాలు

నస్పూర్: నస్పూర్ పట్టణం సుందరయ్య కాలనీ వారసంత వ్యాపారుల ఆధ్వర్యంలో ఆషాఢబోనాలు నిర్వహించారు. సీసీసీ కార్నర్ నుంచి డప్పుచప్పుళ్ళు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, నెత్తిన బోనాలు, భక్తుల కోలాహలంతో ఊరేగింపు వార సంత వరకు సాగింది. సుందరయ్య కాలనీ వార సంత వ్యాపారులు పాల్గొన్నారు.



పోలీసుల ఆధ్వర్యంలో కళాజాతా

వాంకిడి, జూలై 11: వాంకిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్సై సాగర్ ఆధ్వర్యంలో పోలీసు జాగృతి కళా బృందం కళాజాతా నిర్వహించింది. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, కుటుంబ నియంత్రణ చర్యలు, చదువు ప్రాముఖ్యం, యువత చెడు అలవా ట్లకు బానిసలుగా మారకూడదని, మహిళా భద్రత మొదలైన అంశాలపై కళాకారులు అవగాహన కల్పించారు. పోలీసు కళాకారుల ప్రదర్శన విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకు న్నాయి. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత విద్యపై దృష్టి సారించాలని ఎస్సై కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీవో చంద్రయ్య, లెక్చరర్లు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై సాగర్

ఇసుక డంపులు సీజ్

చెన్నూరు, జూలై 11: నర్సక్కపేట, పొగెపల్లి, ముత్తరావుపల్లి గ్రామ సమీపాల్లోని పంట పొలాలు, ఇండ్ల సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను గురువారం సీజ్ చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. ఇసుక డంపులు ఉన్నాయనే సమాచారం మేరకు రెవెన్యూ, పోలీసులు వెళ్లి సీజ్ చేశామన్నారు. పలువురు ట్రాక్టర్ యజమానులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశాన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసినా, నిల్వ చేసినా చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఆర్ఐ రంజిత్ పాల్గొన్నారు.

రాయితీపై గడ్డి విత్తనాలు

భీమిని, జూలై 11: మండలంలోని పశుపోషకులకు రాయితీ మేలు రకమైన సీఎస్‌హెచ్ 24 ఎంఎఫ్ గడ్డి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి సందీప్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వమే రాయితీ విత్తనాలను అందజేస్తుందన్నారు. 5 కిలోల ఒక బ్యాగు విలువ రూ.455 ఉండగా సబ్సిడీపై 5 కిలోల బ్యాగు విలువ రూ. 130 లకు ఇవ్వనున్నట్లు వైద్యుడు తెలిపారు. వీటిని గొర్రెల యూనిట్లు కలిగిన లబ్ధిదారులు, పశు సందప ఉన్న లబ్ధిదారులు తీసుకెళ్లాలని కోరారు.

రోడ్డు ప్రమాదం

మందమర్రిరూరల్, జూలై 11: మందమర్రికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి దుమ్మని సత్యనారాయణ ప్రయాణిస్తున్న కారు గురువారం సిద్దిపేటలోని గౌరారం వద్ద ప్రమాదానికి గురైంది. కారు ద్విచక్ర వాహనాన్ని ప్రమాదవశాత్తూ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారునికి గాయాలు కాగా, సత్యనారాయణకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు : ఒకరికి గాయాలు


మంచిర్యాల అర్బన్, జూలై 11 : రాంనగర్‌లో బుధవారం అర్ధరాత్రి ఓ కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో ఆ ప్రాంతంలో సుమారు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గింది. కారు ముందుభాగం దెబ్బతినడంతో పాటు ప్రక్కనే ఉన్న మరోకారు డ్యామేజీ అయింది. కారులో నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తుండగా ఒకరికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం. పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

జైపూర్: మండల కేంద్రంలోని వెలిశాల మల్లన్న ఆలయం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. చెన్నూరుకు చెందిన సూరం బ్రహ్మారెడ్డి సింగరేణి కార్మికుడు మంచిర్యాల నుంచి చెన్నూరుకు వెళ్తుండగా చెన్నూరు నుంచి జైపూర్ వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా ఢీకొట్టింది. ప్రమాదంలో బ్రహ్మారెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో మంచిర్యాల ఆసుపత్రికి అనంతరం కరీంనగర్‌కు తరలించారు. ఆటో ట్రాలీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి









బ్యాంకు వద్ద పోలీసుల తనిఖీలు

నస్పూర్, జూలై 11: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల బ్యాంకుల వద్ద పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహించారు. బ్యాంకులు, లాకర్ల వద్ద భద్రత ఏర్పాట్లను సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. బ్యాంకులు, ఏటీఎంల వద్ద అమాయక బాధితులను మోసం చేసి దొంగతనాలకు పాల్పడకుండా ముందస్తుగా ఆకస్మిక తనిఖీలు చేసినట్లు ఎస్సై సుగుణాకర్ తెలిపారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 100కు డయల్ చేయాలన్నారు.

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ ఎస్సై ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు, దక్కన్ గ్రామీణ బ్యాంకు, ఎస్‌బీఐ బ్యాంకుల తనిఖీలు చేశారు. బ్యాంకుల వద్ద భద్రత ఏర్పాట్లు, సీసీ కెమెరాల పని తీరు, అత్యవసర సమయాల్లో పని చేసే అలారం సిస్టం పరిశీలించారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం

రామకృష్ణాపూర్, జూలై 11: పులిమడుగులో గురువారం నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించినట్లు ఏసీపీ రవికుమార్ తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత పోలీసు బాధ్యత అని, కొత్త వ్యక్తులు, నేరస్థులు షెల్టర్ తీసుకుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత చెడు అలవాట్లకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్, తాళ్లగురిజాల, బెల్లంపల్లి ఎస్సైలతో పాటు ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

టీహబ్‌ను సందర్శించిన గిరిజన విద్యార్థులు

ఏసీసీ, జూలై 11: జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులు గురువారం హైద్రాబాద్‌లోని టీహబ్ కేంద్రాన్ని సందర్శించారు. గురువారం తెల్లవారుజామున మంచిర్యాల నుంచి ప్రత్యేక బస్సులో హైద్రాబాద్‌కు వెళ్తున్న విజ్ఞాన యాత్ర బస్సును జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి గంగారం ప్రారంభించారు. ఏటీడీవో చిరంజీవి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికత విజ్ఞాన కేంద్రాల సందర్శన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్పోర్ట్స్ అధికారి జీవరత్నం, శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా మొక్కలు నాటాలి

మందమర్రిరూరల్, జూలై 11 : వన మహోత్సవంలో భాగంగా ఊరూరా మొక్కలు నాటాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. గురువారం అందుగులపేట, పులిమడుగు, బొక్కలగుట్ట గ్రామాల్లో గ్రామస్థులకు మొక్కలను పంపిణీ చేశారు.

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి



భీమారం కేజీబీవీలో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

భీమారం, జూలై 11: విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం కేజీబీవీ పాఠశాలలో ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, సైబర్‌నేరాలు, మహిళల చట్టాలు, గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఏసీపీ మాట్లాడుతూ ఎవరైన ఆకతాయిలు వేధిస్తే షీటీం, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దాన్ని సాధించేందుకు ముందుకు సాగాలన్నారు. సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయని, గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా, ఓటీపీ, ఏటీఎం నంబర్లు చెప్పవద్దన్నారు. శ్రీరాంపూర్ సీఐ మోహన్, భీమారం ఎస్ఐ రాములు, డబ్ల్యూవో ఆనంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నూరు: మహిళల రక్షణే పోలీసుల బాధ్యత అని ఎస్ఐ వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. మహాత్మాజ్యోతి బాపూలే పాఠశాలలో విద్యార్థులకు సైబర్ క్రైం, ట్రాఫిక్ రూల్స్, ర్యాగింగ్, మత్తు పదార్థాలు, ఆత్మహత్యల నివారణ, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. బాలికలను ఎవరైనా ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ చేస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కోటపల్లి: సీసీ కెమెరాల ఏర్పాటుతో మరింత భద్రత కలుగుతుందని చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్ అన్నారు. కస్తూర్బాగాంధీ పాఠశాలలో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థుల భద్రత పరంగా మరిన్ని కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలలో చేపట్టాల్సిన భద్రత చర్యలపై పలు సూచనలు చేశారు. కేజీబీవీ ప్రత్యేకాధికారిణి హరిత పాల్గొన్నారు.

నెన్నెల: చిత్తాపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పోలీసులు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బాలికల విద్య, బాల్య వివాహాలు, ఆకతాయిల వేధింపులను ఎదుర్కొనే విధానాలపై ఎస్సై ప్రసాద్ వివరించారు. ఎలాంటి సమస్యలున్న పోలీసులను సంప్రదించాలని కోరారు. పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని హెచ్ఎంకు సూచించారు.

జన్నారం: కిష్టాపూర్ కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, సైబర్ నేరాలు, షీటీంపై ఎస్ఐ రాజవర్ధన్ అవగాహన కల్పించారు. ఆకతాయిలు ఎవరైనా వేధిస్తే డయల్ 100కు కానీ, షీటీంకు సమాచారం అందించాలన్నారు. ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

గిరిజన యువత అభివృద్ధికి కృషి చేస్తా



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న తిరుపతి

జన్నారం, జూలై 11 : గిరిజన యువత అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర గిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. గురువారం దండేపల్లికి వెళ్తుండగా జన్నారం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజనుల, యువత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నాయకులు ప్రకాష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ ఛైర్మన్‌గా కోట్నాక తిరుపతిని స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్, రాజుగూడ మాజీ సర్పంచు మర్సుకోల లచ్చుపటేల్, తాళ్లపేట, రాజుగూడ మాజీ ఉపసర్పంచులు పుట్టపాక తిరుపతి, రాజయ్య, నాయకులు దయాకర్, శంకర్, భగవంత్‌రావు సన్మానించారు.

సన్మానం

జైపూర్, జూలై 11: ఇందారం ఎంపీటీసీ అరికె స్వర్ణసంతోష్ పదవి కాలం పూర్తి కావడంతో గురువారం గ్రామంలో యాదవ కులస్తులు, గ్రామస్థులు ఎంపీటీసీ దంపతులను సన్మానించారు. ఎంపీటీసీ మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ముందుంటానని తెలిపారు. కత్తెరసాల, కొరివి రాజన్న, కొరివి రమేష్, రాజన్న, ఓదెలు, లక్ష్మణ్, మల్లేష్, రాయలింగు, తిరుపతి పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

లక్షెట్టిపేటరూరల్, జూలై 11: హ్యూమన్‌రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ సభ్యులు గురువారం లక్షెట్టిపేట సీఐ నరేందర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. మత్తు పదార్థాలు వల్ల యువత చెడిపోతున్నారని దానిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. డిస్ట్రిక్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ గణేష్‌కుమార్, కృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు రక్షణ చట్టం రూపొందించాలి



మంచిర్యాలలో రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు

ఏసీసీ, జూలై 11: న్యాయవాదుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం రూపొందించాలని జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్, న్యాయవాదులు అన్నారు. సిద్దిపేటలో రవికుమార్ అనే న్యాయవాదిపై ఏఎస్ఐ దాడి చేసి గాయపర్చడాన్ని నిరసిస్తూ గురువారం న్యాయవాదులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. వారు మాట్లాడుతూ న్యాయవాదులపై రోజురోజుకు పెరుగుతున్న దాడులను అరి కట్టేందుకు రక్షణ చట్టాన్ని అమలులోకి తేవాలన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: సిద్దిపేటకు చెందిన న్యాయవాదిపై ఏఎస్ఐ ఉమారెడ్డి దాడి చేయడాన్ని నిరసిస్తూ బార్ అసోసియేషన్ నాయకులు విధులు బహిష్కరించి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట నిరసన తెలిపారు.

లక్షెట్టిపేటరూరల్: న్యాయవాదుల రక్షణ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కోరారు. సిద్దిపేటలో న్యాయవాదిపై ఏఎస్ఐ దాడి చేయడాన్ని నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, అక్కల శ్రీధర్, రాజారాంరెడ్డి, సత్తన్న, తిరుపతి, స్వామి,పద్మ,రవికుమార్, సత్యగౌడ్, పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం సందర్శన

కోటపల్లి, జూలై 11: మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాన్ని గురువారం డీఆర్‌డీఏ పీడీ కిషన్ సందర్శించారు. వసతి గృహంలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన పనులు, సౌకర్యాలు తదితర అంశాలపై తెలుసుకున్నారు. వసతి గృహంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి, ఎంపీడీవో ఆకుల భూమన్న, ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, గణాంకశాఖ అధికారి సురేష్, వసతి గృహం ప్రత్యేకాధికారిణి హరిత, పాల్గొన్నారు.

మరమ్మతు పనుల పరిశీలన

మందమర్రిరూరల్, జూలై 11 : ఆదర్శ పాఠశాల వసతి గృహంలోని మరమ్మతు పనులను గురువారం డీఆర్‌డీవో కిషన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి, వసతి గృహం సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధికారులు

జైపూర్, జూలై 11 :మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి అన్నారు. గురువారం పెగడపల్లి సెక్షన్ అటవీ ప్రాంతంలోని నీలగిరి ప్లాంటేషన్‌లో కుందారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలిసి వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ జీవరాశుల మనుగడ మొక్కల పెంపకంపైనే ఆధారపడి ఉందన్నారు. మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సురేష్‌కుమార్, బెల్లంపల్లి మేనేజర్ సునీత, ఉపాధ్యాయులు రామకృష్ణ, రాజమొగిలి, ఫీల్డ్ సూపర్‌వైజర్‌లు శ్రీనివాస్, తిరుపతి, వాచర్‌లు శంకర్, లచ్చన్న, సిబ్బంది సాహిద్, సాయికృష్ణలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కాసిపేట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్టు డీఆర్‌వో ప్రవీణ్‌నాయక్ అన్నారు. సల్పలవాగుకు వచ్చిన పర్యాటకులకు ఆయన అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సల్పలవాగుకు వచ్చే పర్యాటకులు మద్యం, ప్లాస్టిక్ బాటిళ్లను, కవర్లను పడేయడం వల్ల వన్య ప్రాణులు ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. చెట్లను నరకవద్దని సూచించారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

కేకే 5 గనిపై ఆకట్టుకుంటున్న పచ్చదనం



కేకే 5 గని ఆవరణలో ఉన్న చెట్లు

మందమర్రి టౌన్, జూలై 11: కేకే 5 గని ఆవరణ పచ్చదనంతో ఆకట్టుకుంటోంది. పక్షుల కిలకిల రావాలు కార్మికులకు స్వాగతం పలుకుతుంటాయి. గని ప్రారంభంలో పెట్టిన మర్రి చెట్లు ఏపుగా పెరిగి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. రెండు ఎకరాల స్థలంలో నిమ్మ, దానిమ్మ, అరటి, జామ మొక్కలను పెంచుతున్నారు. కార్యాలయం ఎదుట పూల మొక్కలను పెంచుతున్నారు. కార్మికులకు అల్పాహారం చేసేందుకు రెస్ట్ హాల్స్ ఏర్పాటు చేసినప్పటికి చెట్ల కిందనే భోజనాలు చేయడానికి ఇష్టపడతారు. గనికి కిలోమీటర్ దూరం లో పశువుల ఆకలి తీర్చేందుకు పండ్ల మొక్కలతో మంకీఫుడ్ ఏర్పాటు చేశారు. మూడేళ్ళ క్రితం పర్యావరణ ప్రేమికుడు, సీఎండీ బలరాం ప్రత్యేకంగా వెయ్యి పండ్ల మొక్కలను నాటారు. ఆయన పేరిటనే బలరాం వనం అని నామకరణం చేశారు. కేకే5 గని మేనేజర్ తోటల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

మొక్కలతోనే మానవాళికి మనుగడకు : జీఎం మనోహర్

భావితరాల భవిష్యత్ కోసం మొక్కలు నాటాలి. సింగరేణి సీఎండీ బలరాం మొక్కలు నాటడంలో స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అధికారులు, ఉద్యోగుల సహకారంతోనే మొక్కల సంరక్షణ సాధ్యపడుతుందని, గనిపై ఉన్న బలరాం వనం, ఫుడ్ మంకీ కోట్‌తోపాటు అందులో పిచ్చి మొక్కలను తొలగిస్తూ వాటి ఎదుగుదలకు చర్యలు చేపడుతున్నాం.



గని సమీపంలో బలరాం వనం

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

దహెగాం(పెంచికలపేట), జూలై 11: మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తెలిగే రాజన్న(41) ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. ఇటీవల కుటుంబీకుల మధ్య గొడవలు జరుగడంతో భార్యపిల్లలు ఆమె పుట్టింటికి వెళ్లారు. కాగా బుధవారం దుర్వాసన రావడంతో స్థానికులు, కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. తల్లి పెంటక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. కాగా రాజన్న మృతి చెందాడని తెలుసుకొని కొండపల్లి గ్రామానికి చెందిన మేనమామ తుమ్మిడే బాలయ్య(58) రాత్రి నిద్రలోనే హఠాన్మరణం పొందడంతో కుటుంబం లో విషాదం నెలకొంది. బాలయ్య రాజన్న మృతదేహం వద్ద అర్ధరాత్రి వరకు రోదించాడు. అనంతన మేన కోడలు అంకుబాయి ఇంట్లో నిద్రపోయాడు. తెల్లవారుజామున బంధువులు అతడిని నిద్రలేపేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. బంధువులు బాలయ్య మృతదేహాన్ని కొండపల్లి గ్రామానికి తరలించారు.

ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు

బెజ్జూరు, జూలై 11: మండల కేంద్రంలో గురువారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంతోష్, విలేజ్, శ్యాంసుందర్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

కెరమెరి, జూలై 11: వనమహోత్సవాన్ని మండలంలో విజయవంతం చేయాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు గ్రామాల్లో అన్ని శాఖల సమన్వయంతో వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. వర్షాకాలంలో మారు మూల గ్రామ పంచాయతీల కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా నది పరివాహక గ్రామాల్లోని కార్యదర్శులు హెడ్‌క్వార్టర్‌లోనే ఉండాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ దత్తు ప్రసాద్, అటవీ అధికరి మజారో ద్దీన్, ఏఈ విశ్వేశ్వర్, ఏపీఓ మల్లయ్య, కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించాలి

- ఏసీఎంవో ఉద్ధవ్

కెరమెరి, జూలై 11: ఆశ్రమ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులలో చదవడం, రాయడంలో నైపుణ్యం పెంపొందించాలని ఏసీఎంవో ఉద్ధవ్ అన్నారు. మండలంలోని హట్టి, అనార్‌పల్లి ఆశ్రమ పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యతాభివృద్ధి పెంపొందించాలన్నారు. అలాగే ఉపాధ్యాయులు తరగతి గదిలో ఫోన్‌లు వినియోగించకూడదని చెప్పారు. టీచింగ్ డైరీ మెంటనెన్స్ చేయాలన్నారు. పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించలచానలి ఆయన సూచించారు. ఆయన వెంట ఎఈఆర్పీ శ్యాంరావు, ఉపాధ్యాయులు బలిరాం, ప్రేందాస్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణపై

అవగాహన కలిగి ఉండాలి

» డీఎంహెచ్‌వో తుకారాం భట్



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో తుకారాం భట్

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 11: కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో తుకారాం భట్ అన్నారు. ప్రపంచజనాభా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రలో నిర్వహించినే ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డకు బిడ్డకు మధ్య ఎడమ ఉండడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. పిల్లల పెంపకంలో కూడా ఇబ్బందులు ఉండవని వివరించారు. ఐదు నుంచి 49 సంవత్సరాల లోపు ఉన్న ఆడవాళ్లకు కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. శాశ్వత కుటుంబ నియంత్రణ గురించి మాత్రమే కాకుండా తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలన్నారు. ఐయూడీ, నిరోద్, గర్భనిరోధక మాత్రలు, ఇంజక్షన్లు వంటి గర్భనిరోధక సాధనాలను ఉపయోగించడం వల్ల కూడా జనాభా ను నియంత్రించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, ఎస్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వినోద్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాలకు 48 దరఖాస్తులు

వాంకిడి, జూలై 11: మండలంలో మహిళా శక్తి పథకం కింద మంజూరైన మీ సేవా కేంద్రాలకు 48 దర ఖాస్తులు వచ్చినట్లు ఏపీఎం మహేష్ తెలిపారు. మండలానికి ఏడు మీ సేవ కేంద్రాలు మంజూరయ్యా యని చెప్పారు. వాంకిడి మీ సేవ కేంద్రానికి 10, ఖమాన కేంద్రానికి 15, ఇందాని కేంద్రానికి తొమ్మిది, బెండారకు ఐదు, బంబారకు నాలుగు, గోయగాంకు మూడు, జైత్‌పూర్‌కు రెండు చొప్పున దరఖాస్తు లు వచ్చినట్లు ఏపీఎం మహేష్ తెలిపారు.

విద్యార్థినులు ఉన్నత చదువులపై దృష్టి సారించాలి

వాంకిడి, జూలై 11: విద్యార్థినులు ఉన్నత చదువులపై దృష్టి సారించాలని సీఐ శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ఇంజనీరింగ్ దినోత్సవం సందర్భంగా కేబీజీవీలో గురువారం కాంగ్రెస్ యువజన సంఘం అధ్యక్షుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ హైదారాబాద్ సంస్థానంలో ప్రముఖ ఇంజనీర్‌గా సేవలందించిన నవాబ్ అలీ న వాజ్ జంగ్ బహదూర్ గొప్ప తనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్సై చంద్రశేఖర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రైసాఖాతూన్, నాయకులు గణేష్, రాహుల్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ కేటుగాళ్ల కొత్త పంథా

- వాట్సాప్‌కు లింకులు

- ఓపెన్‌చేస్తే చాలు హ్యాక్ అవుతున్న సెల్‌ఫోన్లు

- డబ్బులు కావాలంటూ మెసేజ్‌లు



హ్యాక్ అయిన నంబరుతో పంపించిన మెసేజ్



డిలీట్ చేయాలని అడ్మిన్‌కు పెట్టిన మెసేజ్

కాగజ్‌నగర్, జూలై 11: ఆన్‌లైన్ ప్రపంచంలో సైబర్ కేటుగాళ్లు రోజుకో కొత్త దాడి చేస్తున్నారు. ఇన్నాళ్లు మీ ఏటీఎం కార్డు గడువు ముగిసిందని, కొత్త కార్డు పంపిస్తున్నామని ఇందుకు ఓటీపీ నెంబరు కావాలంటూ ఖాతాదారులకు బ్యాంకు వాళ్లమని చెప్పి మోసం చేసిన సంఘటనలు చూశాం. వీటిపై పోలీసులు, బ్యాంకు అధికారులు ముమ్మర ప్రచారం చేయటంతో ప్రస్తుతం వీటిని ఎవరూ నమ్మడం లేదు. దీంతో సైబర్ కేటుగాళ్ల పద్ధతి మార్చేశారు. నెల రోజుల నుంచి అన్ని మొబైల్స్‌కు పీఎం కిసాన్ యోజన, ఎస్‌బీఐ రివార్డ్స్ కార్నివాల్స్ పేరిట మెసేజ్‌లను పంపిస్తున్నారు. పొరపాటున ఆ మెసేజ్‌ను క్లిక్ చేశారో వాడుతున్న సెల్‌ఫోన్ హ్యాక్ అవుతుంది. హాక్ అయిన ఫోన్‌లో ఇతర నంబర్లు తెలుసుకుని అన్నింటికీ మెసేజ్ పంపుతున్నారు. కొంత మందికి తెలిసిన వ్యక్తిగా నమ్మించి డబ్బులు అవసరమున్నాయని మెసేజ్‌లు పెడుతున్నారు. ఈ విషయం తెలియక కొంతమంది డబ్బులను వారి అకౌంటులోకి పంపుతున్నారు. ఇప్పుడు వాట్సప్ ఆన్‌చేస్తే చాలు రెండు మెసేజ్‌లు వచ్చి పడుతున్నాయి. అనవసరపు సైట్‌ల లింక్‌లను క్లిక్ చేయవద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఒక్కసారి ఫోన్ నంబరు హ్యాక్ అయిందంటే మీ వివరాలు హ్యాకర్ చేతిలోకి పోతాయని, అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 11: సిద్దిపేట జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న ఎం రవికుమార్‌పై భౌతిక దాడి చేయడాన్ని ఖండిస్తూ గురువారం బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ సూచన మేరకు ఆసిఫాబాద్ జిల్లా న్యాయస్థానంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హైకోర్టు అంటిసిపేటరీ బెయిల్ కోసం పోలీసు స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాది రవికుమార్‌పై అక్కడి ఎస్సై దౌర్జన్యం చేసి భౌతిక దాడి చేయడం సరికాదని చెప్పారు. ఇష్టమొచ్చినట్లు కొట్టడంను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్, న్యాయవాదులు సురేష్, సతీష్‌బాబు, రవీందర్, విద్యాసాగర్, రామకృష్ణ, వినయ్, రాజ్‌కుమార్, గణపతి, సంజీవ్ పాల్గొన్నారు.

వాచ్‌మన్ నుంచి లెక్చరర్ స్థాయికి...



విజయ సంకేతం చూపుతున్న రాజ్‌కుమార్

బెల్లంపల్లి, జూలై 11: వాచ్‌మన్‌గా పనిచేసి జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించాడు కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన కొమురయ్య-పుష్పలత దంపతుల కుమారుడు రాజ్‌కుమార్. రాజ్‌కుమార్ తండ్రి పంచాయతీరాజ్ శాఖలో అటెండర్‌గా విధులు నిర్వహించేవాడు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండేది. తండ్రి మరణం తర్వాత కుటుంబానికి ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. రాజ్‌కుమార్ డిప్లొమాతోనే చదువు మానేసి పది సంవత్సరాల పాటు కరీంనగర్ జిల్లా పరిషత్ కార్యాలయంలో నైట్ వాచ్‌మన్‌గా విధులు నిర్వహించాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు చదువుకోవాలని సూచించడంతో మళ్లీ చదువుబాట పట్టాడు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఓపెన్ డిగ్రీతోపాటు పీజీ పూర్తి చేశాడు. టెట్ రెండు సార్లు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించాడు. 2017లో నిర్వహించిన ప్రభుత్వ గురుకుల పరీక్షలో టీజీటీ, పీజీటీ ఉద్యోగాల్లో ర్యాంకు సాధించి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పీజీటీ తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో తెలుగు సబ్జెక్టులో రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు, మల్టీజోన్ 1లో మూడో ర్యాంకు సాధించాడు. దీంతో జూనియర్ లెక్చరర్‌గా ఎంపిక య్యాడు. స్నేహితులు, కుటుంబీకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

జోడేఘాట్‌కు బస్సు పునరుద్ధరించాలి

కెరమెరి, జూలై 11: ఆర్టీసీ అధికారులు జోడేఘాట్‌కు బస్సును పునరుద్ధరించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్ కోరారు. స్థానికంగా గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 వరకు ఆసిఫాబాద్ డిపో నుంచి బస్సును ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో జోడేఘాట్ వరకు రెండు ట్రిప్పులు బస్సులు నడిపించారని చెప్పారు. కలెక్షన్ రావడం లేదని, కరోనా కారణంగా బస్సు నడపించడం లేదన్నారు. దీంతో జోడేఘాట్‌తో పాటు పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారని చెప్పారు. ప్రైవేటు వాహనాలలో అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సును నడిపించాలని కోరారు. ఆయన వెంట నాయకులు రాజేశ్వర్, తుకారాం, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్, జూలై 11: కాగజ్‌నగర్ పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రిల్లో స్కానింగ్ సెంటర్లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కానింగ్ సెంటర్ రికార్డులను పరిశీలించారు. అలాగే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్వాలిఫైడ్ డాక్టర్ ఆధ్వర్యంలో స్కానింగ్ చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన నిబంధనల పాటించకుంటే పాటించకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య సిబ్బంది నాగలక్ష్మి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే

ఆసిఫాబాద్, జూలై 11: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డేను పురస్కరించుకొని ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ డీఈ ఇర్ఫాన్ ఫైమద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తారీక్, సభ్యులు శంకర్, వేణుగోపాల్, విశాల్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని బస్టాండు ఏరియాలో ఇంజనీరింగ్ విద్యార్థులు ఇంజనీర్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజంలో ఇంజనీరింగ్ వృత్తి గొప్పదని కొనియాడారు.

కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన ఉపాధ్యాయుడు



కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న ఉపాధ్యాయుడు రంగయ్య

కెరమెరి, జూలై 11: గోయగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఓ ఉపాధ్యాయుడు తన కుమారుడిని చేర్పించి ఆదర్శంగా నిలిచారు. 2021లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సావర్‌ఖేడ ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగయ్య మొదటి నుంచి తన కుమారుడికి తాను పని చేసే పాఠశాలలోనే విద్యను అందించారు. అక్కడ ఒకరి నుంచి ఐదో తరగతి వరకు మాత్రమే ఉంది. దీంతో ఆరు నుంచి పదో తరగతి వరకు ఉన్న గోయగాం జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం అడ్మిషన్ తీసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దహెగాం, జూలై 11: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాని మండల ప్రత్యేకాధికారి పెద్దన్న అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు సేవలు అందించాలని చెప్పారు. పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రాజేందర్, వైద్యాధికారి రాజేందర్, కార్యదర్శులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

ఆసిఫాబాద్, జూలై 11: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సాయికృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2019 నుంచి పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోక పోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని చెప్పారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా పాలకులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సతీష్, నితీష్, సాయినాథ్, కార్తీక్, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్‌కు విశ్రాంత ఉద్యోగుల వినతి

ఆసిఫాబాద్ రూరల్, జూలై 11: ప్రభుత్వ పాలనలో కీలకమైన పాత్ర పోషించి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లాఅధ్యక్షుడు కరుణాగౌడ్ అన్నారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అదనపు కలెక్టర్ వేణుకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రుల్లో హెల్త్ స్కీం కింద నగదు రహిత చికిత్సలు అందించాలని కోరారు. డీయర్నెస్ రిలీవ్‌లను విడుదల చేసి ఒకే మొత్తంగా ఏరియర్స్ సహా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మురళీధర్‌రావు, పురుషోత్తం, తాజుద్దీన్, లింగయ్య, జయదేవ్, అబ్రహ్మం, రమేష్, మధుసూదన్‌గౌడ్, రామన్న, పోచయ్య, మధుకర్, ప్రభాకర్, బొజ్జుబాయి, భూదేవి, గౌరక్క, రాజేశ్వర్, వినోద్, సత్యనారాయణ, సుగుణాకర్, సలీంలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో అకాడి పూజలు


వనదేవతలకు పూజలు చేస్తున్న ఆదివాసీలు

సిర్పూర్(యు), జూలై 11: మండల కేంద్రంలోని ఖాతీగూడ, దేవుగూడ, పెద్దదోబ తదితర గ్రామాల్లో ఆదివాసీలు గురువారం అకాడి వనదేవతల పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసంలో ఆదివాసీలు అకాడి వనదేతలు పూజలు చేస్తారు. ఈ సందర్భంగా గ్రామ పొలిమేరలో గల అటవీ ప్రాంతంలో వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యం వనదేవతలకు సమర్పించారు. వర్షాకాలం ప్రారంభం కావడం అడవిలో కొత్తనీరు, కొత్త గడ్డి మొలకెత్తడంతో ప్రకృతికి పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పశువులకు పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

కౌలు రైతుకు గుర్తింపేదీ..?



- ఏళ్ల తరబడి పట్టించుకోని ప్రభుత్వాలు
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను అమలు చేస్తామని హామీ
- ఇంకా అటువైపుగా అడుగులు పడని వైనం
- దిగుబడి రాకున్నా కౌలు కట్టాల్సిందే
- పండిన పంటను అమ్ముకోవడానికి అవస్థలు
- బ్యాంకు రుణాలు లేక పెట్టుబడి కోసం ప్రైవేటు అప్పులు

> కౌలు రైతు ముందుగా భూమి యజమానికి కౌలులో కొంత భాగం చెల్లించే పొలంలో అడుగు పెట్టాలి. అంటే కౌలు రైతు సాగులో మొదటి పనికి అప్పు తప్పదు. వీరికి బ్యాంకులు రుణాలు ఇవ్వవు. ప్రైవేట్ వ్యక్తుల దగ్గర అప్పులు చేయాల్సిందే. పంట నష్టపోయినా బీమా వర్తిం చదు. వర్తించినా యజమాని ఖాతాకే చేరుతుంది.

చింతలమానేపల్లి, జూలై 11: సొంత భూములు లేక కౌలుపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులను ఏళ్ల తరబడి ప్రభుత్వాలు గుర్తించడం లేదు. పంటసాగు పెట్టుబడి కోసం ప్రభుత్వం నుంచి సాకారం అందక, పండించిన పంట అధికారికంగా అమ్ముకోలేక ఇక్కట్లు పడుతున్నారు. గత ప్రభుత్వంలో వందల ఎకరాలు కలిగిన భూస్వాములు కనీసం సాగువైపు కన్నెత్తి చూడకపోయినా రైతుబంధు అందుతూ వచ్చింది.

కానీ ఆ భూమిని నమ్ముకొని కష్టపడి పనిచేసే కౌలు రైతుకు ఎక్కడా సహాయం అందలేదు. దీంతో ఎందరో కౌలు రైతులు పంట చేతికి వచ్చినా.. రాకున్నా ..కౌలు మాత్రం చెల్లిస్తూ వచ్చారు. పండిన పంట లను అమ్ముకోవడానికి నానా ఇబ్బందులు పడ్డారు. పైగా వ్యవసా యమే తప్ప ఇతర పని చేయలేని కౌలు రైతులంతా ఏడాదంతా కష్టపడి పండించిన పంటను అధిక శాతం వడ్డీకి తీసుకున్న ప్రైవేటు అప్పులే తీరుస్తూ కుటుంబాల పోషణకు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కౌలు రైతులకు రైతు భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుతం వానాకాలం పనులు జోరుగా సాగుతుండగా ఇంత వరకు కౌలు రైతులకు అందే స హాయంపై స్పష్టత లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

పెరుగుతున్న పెట్టుబడులు..

రోజురోజుకూ పంట పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఒక ఎకరంలో పత్తి పంట వేయాలంటే సుమారుగా రూ. 25వేల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. వరి పంటకు ఎకరానికి 23 నుంచి 25 వేలు, మొక్కజొన్నకు ఎకరం పంట సాగుకు 20వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. కౌలు డబ్బులు కాకుండా కౌలు కుటుంబీకుల కష్టం పోను విత్తనాలు, ఎరువులకే అధిక పెట్టుబడి వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎంత కష్టపడినప్పటికీ ఎకరానికి 10వేల నుంచి 15వేల వరకు మిగిలే పరిస్థితి లేదు. 2018 నుంచి రైతు బంధు అమలు చేయగా అప్పటి నుంచి కౌలు రైతులకు ఏదో ఒక రూపకంగా ప్రభుత్వం సాయం చేయాలన్న డిమాండ్ ఉన్నది.

పంట విక్రయానికి..

కౌలు రైతులు తాము పండించిన పంటను విక్రయించడాలనికి సై తం తిప్పలు పడుతున్నారు. పట్టాదారు పుస్తకం ఉన్న రైతులే అమ్ము కోవడానికి వీలు ఉండడంతో కౌలు రైతులు తక్కువ ధరకే దళారులకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి ప్రత్యేక గుర్తింపు కార్డులు అందజేసి బ్యాంకుల నుంచి రుణాలు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ కొంత మేర ఆనందం కలిగించిందని కౌలు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం రైతు భరోసా పథకం 15వేల రూపాయల సాయం వర్తింపజే యాలని కౌలు రైతులు కోరుతున్నారు.

జిల్లాలో 20వేల మంది..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో సుమారుగా 20వేల వరకు కౌలు రైతులున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, ఇతరత్రా రంగాలకు చెందిన వారు వ్యవసాయం చేసే ఆసక్తి లేక పోవడంతో పాటు సాగు కష్టాలను ఎదర్కొనే పరిస్థితులు లేకపోవడంతో తమ భూములను కౌలుకు ఇచ్చేస్తుంటారు. గత ప్రభుత్వం రూ. 5వేల చొప్పున రెండు విడ తలుగా అందించిన రైతు బంధు పథకం పట్టాదారు రైతుల ఖాతాల్లోనే జమవుతూ వచ్చింది. దీంతో పంటను సాగు చేసిన కౌలు రైతు పేరే ఎక్కడా లేకుండా పోయింది. గత ప్రభుత్వం అందించిన రైతుబంధులో కౌలు రైతు ఊసే లేకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. పంటలు సాగు చేసి ఎరువులు, కలుపులు తీయాల్సిన పరిస్థితుల్లో పెట్టుబడి కోసం ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొంది. బ్యాంకులు కూడా కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం లేదు. గతంలో కౌలు రైతులకు రుణ అర్హత కార్డులను జారీ చేసేవారు. కొంత కాలంగా భూములన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేసి ధరణి పోర్టల్ ద్వారా పూర్తి వివరాలను ఉంచింది. కొత్తగా జారీ చేసిన డిజిటల్ పాస్ పుస్తకాల్లో పట్టాదారు పేరు మినహా ఇతర కాలం లేదు. దీంతో కౌలు రైతుల గుర్తింపునకు శాశ్వతంగా అడ్డుకట్ట పడింది.

విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలి

- ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన డీటీడీవో రమాదేవి


మాట్లాడుతున్న డీటీడీవో రమాదేవి

వాంకిడి, జూలై 11: వాంకిడి ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని డీటీడీవో (గిరిజన అభివృద్ధి సంస్థ అధికారి) రమాదేవి ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. పాఠశాలలో ఇటీవల ఒక విద్యార్థినికి మలేరియా జ్వరం రావడంతో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను సిబ్బంది పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా ఉపాధ్యాయులు వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. వర్షాకాలం అంటువ్యాధులు, విష జ్వరాలు ప్రబలే అవకాశాలున్నందున ఎప్పటికప్పుడు విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థినులకు ఆరోగ్య విషయమై ఏ సమస్య వచ్చినా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించాలని ఆమె సూచించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారంగా భోజనం పెట్టాలని తెలిపారు. డీటీడీవో వెంట జీసీడీవో శంకుతల, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ అన్నారు. స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన సందర్శిం చారు. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినికి ఇటీవల మలేరియా జ్వరం రావడంతో ఉపా.ద్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలలో పరిశుభ్రత లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పాఠశాలలోని మురుగునీరు బయటికి వెళ్లకుండా నిలువ ఉండడంతో పాటు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిని పిలిపించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం కావడంతో అంటువ్యాధులు, విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ఉపాధ్యాయు లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థినులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.

'పాత్రికేయుడిపై దాడి సరికాదు'

కాగజ్‌నగర్, జూలై 11: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో బుధవారం విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేస్తుండగా ఓ టీవీ పాత్రికేయుడిపై పోలీసులు దాడి చేయడం సరికాదని సీపీఎం నాయకుడు ముంజం ఆనంద్‌కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కంబాల రమేశ్ అన్నారు. పాత్రికేయుడిపై దాడి చేసి బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లిన ఘటనపై కాగజ్‌నగర్‌లో ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తాళ్లపల్లి సురేందర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఉప్పుల తిరుమలాచారి, తెలంగాణ వర్కింగ్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్ పాస్ మేళా

బెజ్జూరు, జూలై 11: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం దివ్యాంగులకు బస్ పాస్ మేళా నిర్వహించారు. ఈ సందర్భగా ఎంపీడీవో మాధవి మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రభుత్వం రాయితీపై బస్సు పాసులను పంపిణీ చేస్తుందని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని సూచిచారు. ఈ మేళాలో 20 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కార్య క్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రవిశంకర్, ఆర్టీసీ ఏజెంట్ తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మొక్కల పంపిణీ

సిర్పూర్(టి), జూలై 11: సిర్పూర్(టి) మండలం వెంపల్లి, డోర్‌పల్లి, అచ్చెల్లి, భూపాలపట్నం, సిర్పూర్(టి), హుడ్కిలి, లక్ష్మీపురం, కర్జెల్లి, మేడిపల్లి గ్రామ పంచాయతీల్లో గురువారం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో కృష్ణమూర్తి ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలురు, బాలికల హాస్టల్‌ల్లో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏపీవో చంద్రయ్య, హాస్టల్ ఇన్‌చార్జి సంతోష్‌గౌడ్, ఉపాధ్యాయులు గణేశ్, భాగ్య, శ్రీనివాస్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

సిర్పూర్(టి), జూలై 11: సిర్పూర్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో ఏజీపీగా సీహెచ్ శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

16న వైద్య శిబిరం

రెబ్బెన, జూలై 11: బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 16న గోలేటి టౌన్ షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సింగరేణి అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాతా రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ విశ్వనాథ ఆధ్వర్యంలో ఈ శిబిరం కొనసాగుందని పేర్కొన్నారు. బీపీ, షుగర్, ఇతర వ్యాధులున్న ఈ శిబిరానికి వచ్చి పరీక్షలు చేసుకోవాలని కోరారు.

ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు పట్టివేత

ఆసిఫాబాద్, జూలై 11: చిర్రకుంట పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా చిర్రకుంట నుంచి కెరమెరి, జైనూరు మండలాలకు అక్రమంగా మూడు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని ముగ్గురు డ్రైవర్లను అదుపులోకి తీసుకొని ఆసిఫాబాద్ పోలీసు స్టేషన్‌లో అప్పగించామని తెలిపారు. దాడుల్లో ఎస్సై గంగన్న, పీసీ సంజీవ్ పాల్గొన్నారు.

ఆదివాసీలకు ప్రత్యేక కాలం కేటాయించాలి

సిర్పూర్(యు), జూలై 11: దేశ జనగణన సర్వే జాబితాలో ఆదివాసీలకు ప్రత్యేక కాలం కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను గురువారం పలువురు నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఉట్నూర్‌లో నిర్వహించిన రైతు భరోసా వర్క్‌షాప్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోండి ధర్మ కోయపున్నెం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కు మాణిక్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం ఆనంద్‌రావులు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ అధ్యక్షుడు కోట్నాక కోసేరావు, ప్రెసిడెంట్‌గూడ పటేల్ దుర్వా మోతిరాం, సెడ్మకి గుణవంత్‌రావు, మంగం విశ్వంరావు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలాన్ని వ్యతిరేకిస్తున్నాం


దీక్షలో కూర్చున్న నాయకులు

శ్రీరాంపూర్, జూలై 11: సింగరేణికి చెందిన బొగ్గు బ్లాకుల వేలాన్ని వ్యతిరేకిస్తున్నామని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య అన్నారు. ఏఐటీయూసీ చేపట్టిన రిలే దీక్ష నాలుగో రోజుకు చేరింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు నిక్షేపాలను ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. సింగరేణి పరిశోధించి, కోట్లాది రూపాయలు ఖర్చు చేసి సిద్ధం చేసిన బొగ్గు బ్లాకులు వేలం ద్వారా ఇతరులకు ధారాదత్తం చేయడం సిగ్గు చేటన్నారు. వేలం నిలిపివేసి సింగరేణికి బ్లాకులు అప్పగించేవరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సంపత్, పిట్ కార్యదర్శులు మురళీ చౌదరి, మోతె లచ్చన్న, గునిగంటి నర్సింగరావు, ఆకుల లక్ష్మణ్, చంద్రశేఖర్, నాయకులు మొగిలి లక్ష్మణ్, శంకర్, సరోజ తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటా ప్రకటించండి: హెచ్ఎంఎస్

శ్రీరాంపూర్, జూలై 11 : సింగరేణి సంస్థ సాధించిన నికర లాభాల నుంచి 38 శాతం లాభాల వాటా ప్రకటించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ రియాజ్ అహ్మద్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం సింగరేణి సీఎండీ ఎన్. బలరాంకు లేఖ రాశారు. ఏప్రిల్-మే నెలల్లోనే ఆడిటింగ్ పూర్తవుతుందని, జూలై నెల వచ్చినా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటాను ఇంతవరకు ప్రకటించ కపోవడం శోచనీయమన్నారు. ప్రస్తుతం కార్మికులు తమ పిల్లలను పాఠశాలలు, కళాశాలలకు పంపే పనిలో ఉన్నారని, ఫీజులు చెల్లించడం, పుస్తకాలు, ఇతర వస్తువుల కొనుగోలు ఉన్నందున వారికి ఈ సమయంలో డబ్బుల అవసరం ఎంతో ఉంటుందని చెప్పారు.. ఇప్పటికైనా లాభాల వాటా ప్రకటించి ఆగస్టు నెల వేతనంతో అందజేయాలని ఆయన కోరారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి


గురువయ్యను సన్మానిస్తున్న ఉద్యోగులు


శ్రీరాంపూర్, జూలై 11: రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని జీఎం(రక్షణ-కార్పొరే ట్) కె. గురువయ్య అన్నారు. ఆర్‌కె 6 గనిపై నిర్వహించిన రక్షణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఏ, బీ, సీ, డీ రక్షణ సూత్రాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఏ-యాటిట్యూడ్, బీ-బిహేవియర్, సీ-కల్చర్, డీ-డిసిప్లేన్‌ను తమ జీవన విధానంలో భాగంగా చేసుకోవాలన్నారు. నా రక్షణ, నా బాధ్యత అనే నినాదాన్ని అమలు చేయాలన్నారు. రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అప్పుడే ప్రమాదరహిత ఏరియాగా గుర్తింపు పొందుతుందని తెలిపారు. ఈ నెల చివరలో రిటైర్ కానున్న గురువయ్యను బెల్లంపల్లి రీజియన్ రక్షణ జీఎం రఘుకుమార్, ఏరియా రక్షణాధికారి శ్రీధర్, గ్రూప్ ఏజెంట్ ఎ.వి.రెడ్డి, గని మేనేజర్ తిరుపతి, తదితరులు ఆయనను సన్మానించారు. రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, సంక్షేమాధికారి కె. సునీల్ కుమార్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

శ్రీరాంపూర్, జూలై 11: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని డిప్యూటీ సీఎంవో డాక్టర్ పి రమేశ్ బాబు అన్నారు. శ్రీరాంపూర్‌లోని ఓసీపీలో సీఆర్ఆర్ కంపెనీ కాంట్రాక్టు ఉద్యోగులకు వైద్య శిబిరం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కంపెనీలో పనిచేస్తున్న ప్రతి కాంట్రాక్టు ఉద్యోగిని పరీక్షించి వారి ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. తద్వారా అవసరమైనప్పుడు వెంటనే వైద్యం అందించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఓసీపీ పీఓ టి. శ్రీనివాస్, డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు వైద్య శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎ. రాజేశ్వర్, సీనియర్ పీవోలు పి కాంతారావు, బి శంకర్, డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎన్. వెంకటేష్, పి. మనీష, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'బేసిక్ తగ్గించడం సరికాదు'

శ్రీరాంపూర్, జూలై 11: అండర్ గ్రౌండ్‌లో పనిచేస్తూ సర్ఫేస్ జనరల్ మజ్దూర్ కావా లని దరఖాస్తు చేసుకుంటే వారి బేసిక్ వేతనం తగ్గించడం సరికాదని సీఐటీయూ ఏరియా అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఇస్తూ బేసిక్ ప్రొటక్షన్ ఇవ్వం అని చెప్పడం సరికాదన్నారు. కార్మికుడు తన అవసరాల కోసం దరఖాస్తు ఇవ్వడం లేదని, సంస్థ యాజమాన్యం అవసరాల దృష్ట్యా ఆహ్వానిస్తేనే అప్లికేషన్ పెడుతున్నారన్నారు. అయినా బేసిక్ ప్రొటక్షన్ ఇవ్వం అని సర్క్యులర్ జారీ చేయడం సరైంది కాదన్నారు. 2009లో సంస్థ ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం అండర్‌గ్రౌండ్ నుంచి సర్ఫేస్‌కు దరఖాస్తు చేసుకుంటే బేసిక్ ప్రొటక్షన్‌తో పాటు నోషనల్ ఇంక్రిమెంట్ కూడా రక్షించబడుతుందని ఉందన్నారు. ఇప్పుడు దానికి విరుద్ధంగా అధికారులు వ్యవహరించడం తప్పిదమే అవుతుందని తెలిపారు. సమావేశంలో చంద్రశేఖర్, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పసుపు, ఎరుపు కార్డులను రద్దు చేయాలి


మాట్లాడుతున్న టీఎన్‌టీయూసీ నాయకులు

బెల్లంపల్లి, జూలై 11: సింగరేణి యాజమాన్యం ప్రవేశపెట్టిన పసుపు, కార్డులను వెంటనే రద్దు చేయాలని టీఎన్‌టీయూసీ నాయకుడు మణిరాంసింగ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని టీఎన్‌టీయూసీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడారు. సింగరేణిలో నల్ల చట్టాలను అమలు చేస్తూ పసుపు, ఎరుపు కార్డులను తీసుకువచ్చి కార్మికులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వెంటనే యాజమాన్యం పసుపు, ఎరుపు కార్డులను రద్దు చేయాలని కోరారు.. దేశావ్యాప్తంగా మోదీ ప్రభుత్వం దేశ పారిశ్రామిక రంగాన్ని అమ్మడానికి కుట్రలు చేస్తుందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం టీఎన్‌టీయూసీ పోరాటాలు చేస్తుందని, కార్మికులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు గద్దల నారాయణ, జీవరత్నం, మల్లయ్య, హసన్, వెంకటస్వామి, చంద్రమౌళి, పాండే, యాదగిరి, గంగాధర్ గౌడ్, రమేశ్, కుమార్, నారాయణ పాల్గొన్నారు.

మహాసభలకు కార్మికులు తరలిరావాలి

శ్రీరాంపూర్, జూలై 11: శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించే బీఎంఎస్ 18వ ద్వైవార్షిక మహాసభలకు తరలిరావాలని ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్ కోరారు. ఈ మేరకు ఆయన ఆర్‌కె 7 గనిపై పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సభలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, జెబిసిసిఐ సభ్యుడు, బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి, ఎబికెఎంఎస్ ప్రధాన కార్యదర్శి సుధీర్ గురుడే, బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. సింగరేణివ్యాప్తంగా గనులు, కార్మిక హక్కుల సంరక్షణ, తదితర సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, ఆయా విషయాలపై తీర్మాణాలను ఆమోదించి కార్మికులకు ప్రయోజనం చేకూర్చేవిధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి బోయిని మల్లయ్య, పిట్ కార్యదర్శి మోతె ఓదెలు, సహాయ పిట్ కార్యదర్శి కుంట రాజు, గొల్ల మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీని సందర్శించిన సింగరేణి డైరెక్టర్

జైపూర్, జూలై 11: జైపూర్ ఎస్టీపీపీని గురువారం సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ ఎం) సత్యనారాయణరావు సందర్శించారు. ఎస్టీపీపీ యూనిట్ 2 క్యాపిటల్ ఓవరాలింగ్‌లో భాగంగా జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. బాయిల్ టర్బైన్, ఇతర విభాగాల్లోజరుగుతున్న పనులను పరిశీలించి తగిన సూచనలు అందించారు. ప్లాంట్‌నుత్వరగా విద్యుత్ ఉత్పత్తికి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. క్యాపిటల్ ఓవరాలింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట అధికారులు జేఎస్ సింగ్, శ్రీనివాసులు, రావు, విశ్వనాథ రాజు, వేణుగోపాల్‌రావు, పంతుల , ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.